క్లుప్తంగా

గ్యారతారీఖ్ వేడుకలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం గ్యారతారీఖ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్న సొసైటీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో సోమవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. యూరియా కొరత పేరుతో మండల కేంద్రంలోని స్థానిక సొసైటీలో యూరియా ధరలను సొసైటీ కార్యదర్శి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నాడని ఆరోపించారు. పైగా స్థానిక రైతులకు కాకుండా పక్క గ్రామ రైతులకు 30 నుంచి 40 బస్తాల వరకు అమ్ముకుంటున్నాడన్నారు. దస్తగిరి, వీరేష్, రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

ఆదోని అర్బన్: వార్డు, గ్రామాల పరిధిలోని ప్రజలను సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని ఆదోని టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి మహిళా పోలీసులకు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గ్రామ, వార్డు మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న దాడులు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి సంతాపం



నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోతి శివన్న కుమారుడు కోతి నాగరాజు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబానికి ఎర్రకోట కుటుంబం అండగా ఉంటుందని భరోసా నిచ్చారు.

క్షయవ్యాధిని తరిమి కొడదాం

ఆదోని టౌన్: క్షయవ్యాధిని పూర్తి స్థాయిలో తరిమి కొడదామని కౌన్సిలర్ కిషోర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని హనుమాన్ యూపీహెచ్‌సీలో కౌన్సిలర్ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఉద్యానపంటలపై దృష్టి సారించాలి

మంత్రాలయం రూరల్ : రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ భక్తవత్సలం సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతులకు కొబ్బరి, జామ, మామిడి. సపోటా, నిమ్మకాయ తదితర మొక్కలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈసీ రామోహన్‌రెడ్డి, టీఏ లక్ష్మన్న. జయమణి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరించి, పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని యుటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దావీద్, జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు, రాష్ట్ర కౌన్సిలర్ కొలన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆదోని సెంట్రల్/గోనెగండ్ల /మంత్రాలయం రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉనన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్‌బాషా, సహాయ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థులతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గోనెగండ్లలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, తాలూకా అధ్యక్షుడు మునిస్వామి నేతృత్వంలో, మంత్రాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి థామస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.

బాలిక అత్యాచార నిందితుడి అరెస్ట్

ఆదోని రూరల్: పట్టణ సరిహద్దులోని ప్రవల్లిక గార్డెన్స్ వద్ద ఈనెల 4వ తేదీన బాలికపై అత్యాచారం చేసిన ఆటో డ్రైవర్ సంగిపోగు రమేష్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ నల్లప్ప తెలిపారు. సోమవారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు సంగిపోగు రమేష్‌ను మండలంలోని కడితోట క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకునే విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన ఆదోని రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని అభినందించారు.

ఈసారైనా సాగు నీరందేనా..?

- కర్ణాటక జలచౌర్యం కారణంగా ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు అందని నీరు
- సాగునీటి కోటా సాధించడంలో అధికారులు, పాలకులు విఫలం
- ప్రస్తుతం నిండుగా టీబీ డ్యాం
- ఈ సారి పూర్తి స్థాయిలో నీరివ్వాలని కోరుతున్న రైతులు



దిగువ కాలువలో పారుతున్ననీరు (ఫైల్)

ఎమ్మిగనూరు టౌన్: ఏటా ఎల్లెల్సీ ఎగువన ఉన్న కర్ణాటక రైతులు నీటి చౌర్యం కారణంగా దిగువన వున్న ఎమ్మిగనూరు, కోడుమూరు సబ్‌డివిజన్ల పరిధిలో ఆయకట్టుకు సాగునీరందడం లేదు. దీంతో పంటలు పండక రైతులు అప్పులపాలవుతున్నారు. ఆంధ్రాకు ఖరీఫ్‌లో రావాల్సిన సాగు నీటి కోటా సాధించడంలో పాలకవర్గం, సాగునీటి శాఖ ఉన్నతాధికారులు విఫలమవుతుండటంతో ఎల్లెల్సీ కింద సాగు విస్తీర్ణం పడిపోతూ వచ్చింది. అయితే ఈసారి టీబీ డ్యాం పూర్తిగా నిండడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా చివరి ఆయకట్టుకు సాగునీరందుతుందని కోటి ఆశలు పెట్టుకున్నారు.

15వేల ఎకరాలకు గాను 8 వేల ఎకరాలకే నీరు..

ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు గాను తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్ర నీటి కోటా కింద దిగువ కాలువకు 650 క్యూసెక్కులు రావాల్సివుండగా అందులో ఎమ్మిగనూరు సబ్‌డివిజకు 326 క్యూసెక్కుల మేర అందాలని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా అయితే ఒక్క ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 15వేల ఎకరాల్లో పంటలకు సాగు నీరందాల్సివుంది. అయితే సాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో ఏటా 8వేల ఎకరాల లోపే నీరందిస్తున్నారు. అదేవిధంగా కోడుమూరు సబ్‌డివిజన్ కేబీసీ పరిధిలో దాదాపు 18వేల ఎకరాలకు సాగు నీరు అందాల్సి వుండగా ఆ మేరకు సరఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరికి అందని చివరి తడులు..

ఏటా ఖరీఫ్‌లో సాగు కావాల్సిన వరి పంటలకు పూర్తి స్థాయిలో నీరందక తిండి గింజలు పండించుకోలేని దుస్థితిలో వున్నామని రైతులు వాపోతున్నారు. వరి సాగు చేస్తే చివరి తడి అందకపోతుండటంతో వరి పంటకు ఆయకట్టు రైతులు విరామం పలికి పత్తి తదితర పంటలను సాగు చేసుకుంటున్నారు. అధికారులు కూడా స్వల్పకాలిక పంటలే వేసుకోండని ఏటా పేర్కొంటుండటంతో గత్యంతరం లేక ఆయా పంటలనే వేసుకోవాల్సి వస్తోంది. పంటలు చేతికి వచ్చే సమయంలో దిగువ కాలువకు వారబందీ పద్ధతిలో సాగునీరు సరఫరా చేస్తుండటంతో సకాలంలో సాగునీరందక పంటల దిగుబడులు రాక నష్టపోయే దుస్థితి ఏర్పడుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఏటా ఖరీఫ్‌లో దిగువ కాలువ కింద కర్ణాటక ప్రాంతంలో జలచౌర్యం పెరిగిపోయినా దానిని నివారించలేకపోతుండటంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

నిండుగా తుంగభద్ర

ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో వరద నీరు వచ్చి చేరడంతో అదనంగా వచ్చిన నీటిని క్రస్ట్‌గేట్లు ఎత్తి తుంగభద్ర నదికి విడుదల చేస్తున్నారు. డ్యాం నిండుగా వుండటంతో దిగువ కాలువ కింద ప్రస్తుత సీజన్‌లోనైనా సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కుతామని రైతులు భావిస్తున్నారు. ఆ మేరకు ప్రభుత్వం దిగువ కాలువ కింద పూర్తిస్థాయిలో సాగునీరందించి, చివరి ఆయకట్టులో ఖరీఫ్ పంటకాలం పూర్తయ్యే వరకు నిర్దేశించిన నీటి కోటా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎల్లెల్సీ రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్‌కు పూర్తిగా నీరివ్వాలి



ఎల్లెల్సీ ఆయకట్టు కింద 6 ఎకరాలు ఉంది. అయితే వరి సాగుకు పూర్తి స్థాయిలో సాగునీరందదని పత్తి సాగు చేశా. మా గ్రామ పరిధిలో రైతులంతా పత్తి సాగు చేసుకుంటున్నారు. పంట చేతికి వచ్చే దశలో సాగునీరందదు. మొదట్లో నీరు సక్రమంగా వచ్చినా తరువాత అస్తవ్యస్తంగా మారి నీటి సరఫరా లేక పంటలను కోల్పోతూ నష్టపోతున్నాం .తుంగభద్ర లో నీరు ఎక్కువ వుంది కాబట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు పంట కోత వరకు విడుదల చేసి ఆదుకోవాలి.

– లోకారెడ్డి, పెద్దనెలటూరు గ్రామం

ఎల్లెల్సీ కింద ఖరీఫ్ ఆయకట్టు విస్తీర్ణం పెంచాలి



తుంగభద్ర దిగువ కాలువ కింద ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు విస్తీర్ణం పెంచి సాగునీరివ్వాలి. ప్రాజెక్ట్‌లో నీరు పుష్కలంగా వున్నందున ఆయకట్టుకు సాగు నీరిస్తే ఇప్పటి వరకు సాగు ఉపక్రమించని రైతులు వరి పంట సాగు చేసే అవకాశం వుంది. వరి సాగు చేసే రైతులకు పంట పూర్తయ్యే వరకు సాగునీరిస్తామని అధికారులు భరోసా ఇవ్వాలి, ఆమేరకు ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలి.

– గద్దం లక్ష్మీనారాయణరెడ్డి, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బాబు ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం 3 గంటలకు బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పూర్తి స్థాయిలో అమలు చేయక మోసం చేశారన్నారు. దీనిని ప్రజల్లో తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై వుందన్నారు. సమావేశానికి నియోజకవర్గంలో ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

రేపు రాంపురంలో విస్తృతస్థాయి సమావేశం

కౌతాళం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ప్రహల్లదచారి తెలిపారు. నియోజకవర్గ స్థాయి సమావేశం రాంపురంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అధ్యక్షతన ఉంటుందని, నాలుగు మండలాల నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణకు తరలిరండి



వైఎస్సార్ విగ్రహంతో వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు: మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామం వద్ద మంగళవారం నిర్వహించే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్, నాయకుడు అయప్ప, ఎంపీటీసీ సభ్యుడు, నాయకుడు మహాదేవ, నాయకుడు మూలింటి మూకరెడ్డి పిలుపునిచ్చారు. గతంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు గత సంవత్సరం ఇదే నెల 20వ తేదీన (20-7-2024) విరగగొట్టిన విషయం విధితమే. సోమవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరిగి కొత్త విగ్రహాన్ని తయారు చేసినట్లు తెలిపారు. మంగళవారం వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా కొత్త విగ్రహాన్ని అవిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని మండల ప్రజలతో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాని కోరారు.

నేడు వైఎస్సార్ జయంతి



మాట్లాడుతున్న చంద్రకాంత్‌రెడ్డి

ఆదోని టౌన్: మండలంలో మంగళవారం దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బి.దేవా తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల సంక్షేమానికి, విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన బాటలోనే నడిచి విద్య, ప్రజల ఆరోగ్యం, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. మంగళవారం ఆదోని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు చేపట్టే వైఎస్సార్ జయంతి వేడుకల్లో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ వైస్ ప్రెసిడెంట్ ఉప్పరగిరి నారాయణ, జనరల్ సెక్రటరీ గంగాధర్, గాజుల నాగరాజు, సెక్రటరీలు బాబా, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



ప్రజా సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, డీఎల్‌పీవో తిమ్మక్క, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఏడీఏ బాలవర్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని అర్బన్: పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మ శ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పుట్టినరోజు, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ నూతన జెండాను ఎమ్మెల్యే పార్థసారథి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, మనోజ్ , బండారి గిడ్డయ్య, భీమ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలోని బదినేహాల్, ఎరిగేరి, బాపురం, లింగలదిన్నె గ్రామాల్లో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారి హనుమంతు ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. సల్మాన్‌రాజు, మండల అధ్యక్షుడు ఆనంద్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కోసిగి: స్థానిక సిద్ధప్ప పాళెంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప మాదిగ, అధికార ప్రతినిధి నరసింహులు మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. సామేల్, చంద్రప్ప, రామన్న, విజయ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎంబీ చర్చి వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఎంఈఎఫ్ సీనియర్ నాయకుడు అంపయ్య, రాష్ట్ర నాయకులు ఆనంద్ చైతన్య అవిష్కరించారు.

దళితుడిపై దాడికి పాల్పడడం దారుణం



సిందాల వెంకటరాముడును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : కులమతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలు చూడడానికి వెళ్లిన దళితుడిపై దాడి చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామానికి చెందిన సిందాల వెంకటరాముడు(వైఎస్సార్‌సీపీ కార్యకర్త)ను ఆదివారం జరిగిన మొహర్రం వేడుకల్లో అదే గ్రామానికి చెందిన వీరేష్, లసుముడు(టీడీపీ కార్యకర్తలు)లు దాడి చేసిన విషయం విధితమే. విషయాన్ని తెలుసుకున్న వై.ప్రదీప్‌రెడ్డి సోమవారం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించాడు. ఆయన మాట్లాడుతూ దళితులను చులకనగా చూడడం కూటమి నాయకులకు అలవాటేనన్నారు. మొహర్రం వేడుకలు కులమతాలకు అతీతంగా జరుపుకోవాలి కానీ ఇలా దాడులకు పాల్పడడం కూటమి నాయకులకే చెల్లితుందన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, నాయకులు దేవదానం, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

ప్రమాద బాధితుడికి పరామర్శ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో కడపాళెం వీధిలోని బసవన్న కట్ట వద్ద నివాసం ఉంటున్న భూగేని వీరారెడ్డి అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త మూడు రోజుల క్రితం బైక్ ప్రమాదానికి గురై గాయపడ్డాడు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఎంపీపీ ఈరన్నతో కలిసి వీరారెడ్డిని పరామర్శించారు. మెరుగైన వైద్యం చేయించుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట శివారెడ్డి, నాడుగేని వీరారెడ్డి, పరసాని కోసిగయ్య, లోకారెడ్డి, భాస్కర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్/ఆదోని రూరల్: పట్టణంలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఆటో డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌ఓ నాయకురాలు నిఖిత సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి విన్నవించారు. ఆమె మాట్లాడుతూ అత్యాచార ఘటనపై వెంటనే విచారణ చేపట్టి బాధితా కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పీడీఎస్‌ఓ నాయకురాలు శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: పెద్దకడుబూరు మండలం మురవణిలో దళితుడు వెంకటరాముడుపై దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మన్న, చిన్నప్ప డిమాండ్ చేశారు. సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు.

విద్యార్థినులు మనోధైర్యంతో ఉండాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక, బుట్టా శివనీలకంఠ

- ఏ సమస్య వచ్చినా అండగా ఉంటాం
- బనవాసి విద్యార్థినులతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థినీలు ఎప్పుడు ఆత్మ విశ్వాసం కోల్పోకుండా మనోధైర్యంతో ఉండాలని, మీకు ఏ సమస్య వచ్చినా మేము తోడుగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. సోమవారం మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీని సందర్శించారు. విద్యార్థిని రిషిత మృతికి గల కారణాలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తరగతి గదుల్లో విద్యార్థినులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంటారని, ఏమైన సమస్య మీకు వచ్చిందా వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడటం లేదా మీతో చనువుగా ఉండే అధ్యాకులకు, ప్రిన్సిపాల్‌కు తెలియచేయాలని, క్షణికావేశానికి లోనుకావద్దని సూచించారు. గురుకులంలో చదివే విద్యార్థినీలు అంటే మంచి పేరు ఉంటుందని గుర్తు చేశారు. కాలేజీలో ఏమైన సమస్యలుంటే మీ పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్, కాలేజీ సిబ్బంది సూచించారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

విద్యార్థిని రిషిత మృతిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంఠలు డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో రిషిత మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. విద్యార్థిని తల్లిదండ్రులను ఓదార్చి వారికి ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేశారు. వారి వెంట పట్టణ అధ్యక్షులు నాగేశప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, చేనేత జిల్లా అధ్యక్షులు శివకుమార్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు మహబుబ్‌బేగ్, నాయకులు ఉన్నారు.

హెచ్‌ఎంకు పదవీ విరమణ సన్మానం



నాగప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: కౌతాళం మండలం మల్లన్నహట్టి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న నాగప్రసాద్ పదవీ విరమణ పొందారు. ఈ మేరకు సోమవారం ఆదోని పట్టణంలోని శ్రీ మహేశ్వర కళ్యాణ మండపంలో ఎస్టీయూ నాయకుల ఆధ్వర్యంలో హెచ్ఎం నాగప్రసాద్ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1 భూపాల్‌రెడ్డి, ఆస్పరి ఎంఈఓ-1 రాజేంద్రప్రసాద్, ఆలూరు ఎంఈఓ-2 చిరంజీవిరెడ్డి, ఆస్పరి ఎంఈఓ-2 తిరుమలరావు తదితరులు పాల్గొని నాగప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు నాగరాజు, వీరచంద్రయాదవ్, నాగేంద్రప్ప, నరసింహులు, గ్రేడ్-2 హెచ్ఎం వెంకటస్వామి, కాశీ, విశ్వనాథశాస్త్రి, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల జలధి

నందవరం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా సోమవారం పీర్ల జలధి ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పీర్ల ప్రత్యేక అలంకరణాలు గావించి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు వివిధ వేషాధారణతో అళాయి బలాయి ఆడుతూ అలరించారు. పీర్ల ముందు దువాతో వీరుల త్యాగనిరతిని స్మరించుకున్నారు. మండల కేంద్రం నందవరంతో పాటు ముగతి, కనకవీడు, హాలహర్వి గ్రామాల్లో పీర్లకు వెండి గొడుగులు, పూలతో అలంకరించి పీర్లను తెల్లవారుజామున మేళతాళలు, తప్పెట్లతో ఊరేగింపుగా ఏటికి తరలించారు. కనకవీడు గ్రామంలో అళాయి బలాయిలో గొడవ జరగడంతో పోలీసు బందోబస్తు నడుమ జలధి కానిచ్చారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కోసిగి: గ్రామాల్లో కుల, మతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు జరిగాయి. సోమవారం సాయంత్రం కోసిగిలో పెద్ద మసీదు సమీపంలో పీర్ల చావిళ్లలో కొలువు తీరిన పీర్ల దేవుళ్లకు ముస్లింలు ప్రత్యేక ఫతేహాలు నిర్వహించి మేళతాళాలతో ఊరేగింపుగా బయలు దేరారు. అలాగే సిద్దప్ప పాళెంలోని నూరానీ సున్నీ మజిద్, కుమ్మరి వీధిలో సమీపంలోని పీర్ల చావిడిలలో కొలువుతీరిన పీర్లకు ఫతేహాల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. ఇరు వైపుల నుంచి పీర్ల దేవుళ్లు ఎదురెదురుగాగా వచ్చి చౌడమ్మ వీధిలో సమీపంలో కలుసుకుని తిరిగి వెళ్లిపోయారు. పెద్ద మసీదు సమీపంలోని పెద్ద బావి వద్ద పీర్ల దఫన్ కార్యక్రమం నిర్వహించి మొహర్రం వేడుకలు ముగింపు పలికారు. కోసిగితో పాటు మండంలోని చిన్నభూంపల్లి, మూగలదొడ్డి, వందగల్లు, నేలకోసిగి , తుంబిగనూరు, సాతనూరులతో పాటు వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రశాంతం జరుపుకున్నారు.



పెద్దనేలటూర్‌లో పీర్ల దేవుళ్ల ఊరేగింపు

పల్లెల్లో మొహర్రం వేడుకలు

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దనేలటూర్, హెచ్. కైరవాడి, గంజిహళ్లి, బైలుప్పల, బి. అగ్రహారం, వేముగోడు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారు జామున కొలువుదీరిన పీర్లను ఊరేగింపు చేసి పీర్లను చావిళ్లకు చేర్చారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో ఊరేగింపు చేసి పీర్ల దేవుళ్లను ఏటికి సాగనంపారు.

ఉరుకుందలో కొనసాగిన ఆచారం

కౌతాళం: మొహర్రం వేడుకల్లో భాగంగా పదవ రోజైన చివరి రోజు దఫన్ కార్యక్రమం సోమవారం సాయంత్రం నుంచి రాత్రి 8గంటల వరకు జరిగింది. మండలంలోని 90శాతం గ్రామాల్లో సోమవారం దఫన్‌కార్యక్రమం సాగింది. ఉప్పరహాల్, ఉరుకుంద, ఎరిగేరి, నదిచాగి, సుళేకేరి, బంటకుంట, గుడికంబాలి, చూడి, చిరుతపల్లి, ఓబుళాపురం మల్లనహట్టి, కుంటనహాల్, రౌడూరు, నదిచాగి గ్రామాల్లో మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి.

ఈరన్న స్వామి సన్నిధిలో పీర్ల దేవుడు

ఉరుకుందలో మొహర్రం పండుగకి ప్రత్యేక స్థానం ఉంది. గ్రామంలో వెలసిన పీర్ల దేవుడు మొహర్రం రోజు తెల్లవారుజామున ఈరన్న స్వామి దేవాలయంలోకి ఊరేగింపుగా వస్తారు. పీర్ల దేవుడిరాకతో అర్చకులు ముందుగా పీర్ల దేవుడికి పూజలు చేసిన అనంతరం ఈరన్న స్వామికి పూజలు చేపట్టి మహామంగళహారతి ఇవ్వడం శతాబ్దాలుగా ఆనవాయితీ కొనసాగుతున్నది. ఇది సోమవారం కూడా కొనసాగింది.



ఈరన్నస్వామి ఆలయంలో పీర్లకు పూజలు చేస్తున్న దృశ్యం



కోసిగిలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్ల దేవుళ్లు



నందవరంలో వివిధ వేషధారణలో యువకులు



నందవరంలో పీర్ల ఊరేగింపు